క్లుప్తంగా

పరీక్ష ప్యాడ్లు, పెన్నుల పంపిణీ



ముసునూరు: వసతి గృహ విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని బీసీ బాలుర హాస్టల్ వార్డెన్ షేక్ నజీర్ అన్నారు. స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో ఆయన పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలను బాగా రాసి, అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పిల్లల ప్రగతి విషయాలను తల్లిదండ్రులకు తెలిపారు. అనంతరం పదో తరగతి విద్యార్థులు 17 మందికి తన సొంత ఖర్చుతో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు బహూకరించారు. కార్యక్రమంలో సిబ్బంది తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తిరుపతిరావుకే బీసీల మద్దతు

మైలవరం: మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావుకే మైలవరం నియోజకవర్గ బీసీల మద్దతు ఉంటుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈతాకుల జగదీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ బీసీలకు సముచిత స్థానం కల్పిస్తూ మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా బీసీ యాదవ వర్గానికి చెందిన సర్నాల తిరుపతిరావు పేరును ప్రకటించడం హర్షణీయమన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీలకు ఎక్కువ ప్రాతినిధ్యం కల్పించడం వైఎస్సార్ సీపీ తిరిగి అధికారంలోకి రావడానికి నాంది అన్నారు. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేయడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు సమైక్యంగా కృషి చేయాలన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు

చాట్రాయి: ఎన్నికల కోడ్ రావడంతో మండల రెవెన్యూ అధికారులు ఎన్నికల నిబంధనలు అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా రాజకీయ పార్టీల ఫ్లెక్సీల తొలగిస్తున్నారు, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తున్నారు. ఎన్నికల నిబంధనలు ప్రజలు, రాజకీయ నాయకులు తప్పకుండా పాటించాలని తహసీల్దార్ మహ్మద్ మసూద్ అలీ తెలిపారు.

సీనియర్ కమ్యూనిస్టు నేత మృతి

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): మండలంలోని కొటికలపూడికి చెందిన సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు ధనేకుల మోహనరావు (80) అనారోగ్యంతో మృతి చెందాడు. కొద్దికాలంగా పక్షవాతంతో బాధపడుతున్న ఆయన ఆరోగ్యం క్షీణించి ఆదివారం తుదిశ్వాస విడిచారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్నీడి యలమందారావు, తదితరులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. హోమియో డాక్టర్‌గా పనిచేస్తూ వ్యవసాయంపై మక్కువతో రైతు సంఘం నాయకుడిగా ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు.

మారిన ఆర్వో కార్యాలయం

తిరువూరు: తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడిన నాటినుంచి ఉన్న రిటర్నింగ్ అధికారి కార్యాలయం 2024 అసెంబ్లీ ఎన్నికలకు మార్పు చేశారు. ఇప్పటివరకు తిరువూరు తహసీల్దారు కార్యాలయంలో అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకారం, ఎన్నికల పోలింగ్ సామగ్రి పంపిణీ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తుండగా ఇకపై తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఈ ప్రక్రియ జరగనుంది. గతంలో తిరువూరు రిటర్నింగ్ అధికారిగా సబ్ కలెక్టర్ స్థాయి అధికారిని నియమించి ఎన్నికలను నిర్వహించగా, ఇప్పుడు తిరువూరులో ఆర్డీవో ఏర్పాటవడంతో ఆర్డీవో కే మాధవి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారు. తిరువూరులోని కోకిలంపాడు రోడ్డులో ఎన్టీఆర్ మినీ స్టేడియం ఆవరణలో ఆర్డీవో కార్యాలయంలో ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు.

రూ.35 లక్షలతో ఆలయాల నిర్మాణం

పెంట్యాలవారిగూడెం(వత్సవాయి): మండలంలోని పెంట్యాలవారిగూడెంలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో రూ.35లక్షలతో చేపట్టిన శ్రీ దాసాంజనేయస్వామి, రామాలయ నిర్మాణాలు పూర్తయ్యాయి. గతంలో ఉన్న ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో సర్పంచి వడ్డే పరమయ్య తదితరులు చొరవ తీసుకుని ఆలయ పునర్నిర్మాణం చేయాలని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభానును కోరారు. దీంతో ఆయన స్పందించి దేవాదాయశాఖ అధికారులతో మాట్లాడి సీజీఎఫ్‌నిధులు రూ.23.50 లక్షలు విడుదల చేయించగా గ్రామస్తులు మరో రూ 11.50 లక్షలను కాంట్రిబ్యూషన్‌గా చెల్లించారు. ఈ నిధులతో దాసాంజనేయస్వామి ఆలయంతోపాటు రామాలయాన్ని కూడా నిర్మించారు. ఏప్రిల్ మూడోతేదీన ఆలయాల్లో విగ్రహాల ప్రతిష్టకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా స్వామివారి కల్యాణం

నందిగామ: పట్టణంలోని సీతారామాంజనేయ స్వామివారి ఆలయంలో 71వ రామకోటి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు ఆదివారం ఆలయంలోని స్వామివారికి విశేష పూజలు చేశారు. అనంతరం సువర్చల ఆంజనేయ స్వామి వార్ల కల్యాణ మహోత్సవాన్ని వేదపండితులుశాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం సమయంలో పలు ఆధ్యాత్మిక ప్రవచన, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

లక్ష్యానికి మించి..

- డ్వాక్రా మహిళలకు ఆర్థిక చేయూత
- రుణ లక్ష్యం రూ.154.77 కోట్లు
- ఇచ్చిన రుణాలు రూ.305.67 కోట్లు
- ప్రభుత్వ సహకారానికి హర్షం వ్యక్తం చేస్తున్న మహిళలు



వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో సమావేశమైన డ్వాక్రా గ్రూపు సభ్యులు (ఫైల్)

నూజివీడు: మహిళల ఆర్థిక చేయూతకు వారి సాధికారితకు రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటునందిస్తోంది. స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళలకు లక్ష్యానికి మించి లింకేజీ రుణాలను అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా ముందుకు దూసుకెళుతున్నారు. ప్రభుత్వం అందించే తోడ్పాటు, బ్యాంకర్లు అందిస్తున్న సహకారంతో మహిళలు లింకేజీ రుణాలు తీసుకుని కుటుంబ అవసరాలకు వాడుకుంటూ ఆర్థిక ఇబ్బందులు లేకుండా ముందుకు సాగుతున్నారు.

నియోజకవర్గ వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల సభ్యులు రూ.వందల కోట్లు లింకేజీ రుణాల రూపంలో తీసుకుంటూ ఆర్థికంగా బలోపేతమవుతున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో నియోజకవర్గంలో లింకేజీ రుణాల టార్గెట్ రూ.154.77 కోట్లు కాగా, ఇప్పటివరకు డ్వాక్రా మహిళలు తీసుకున్న మొత్తం రూ.305.67 కోట్లకు చేరింది. సీనియర్ గ్రూపులకైతే బ్యాంకులు రూ.20 లక్షలు సైతం రుణంగా ఇస్తున్నాయి. రుణాలను సక్రమంగా తిరిగి చెల్లించిన గ్రూపులకు బ్యాంకులు రుణాన్ని మరింత పెంచి ఇస్తున్నాయి.

ప్రభుత్వ సహకారంతో..


డ్వాక్రా మహిళలకు ఒకవైపు బ్యాంకర్లు లింకేజీ రుణాలు ఇస్తుండగా, మరోవైపు ప్రభుత్వం పావలా వడ్డీని క్రమం తప్పకుండా చెల్లిస్తుండటంతో డ్వాక్రా సంఘాల మహిళలు కూడా తాము తీసుకున్న రుణాలను బ్యాంకులకు బకాయి పడకుండా తిరిగి చెల్లిస్తున్నారు. దీంతో రికవరీ బాగా వస్తుండటంతో బ్యాంకర్లు కూడా డ్వాక్రా సంఘాలకు రుణాలు ఇచ్చేందుకు వెనుకాడటం లేదు. నూజివీడు మండలంలో లింకేజీ రుణాల లక్ష్యం రూ.37.81 కోట్లు కాగా, ఇప్పటికే రూ.102.25 కోట్లు రుణాలు అందించారు. ముసునూరు మండలం లక్ష్యం రూ.41.20కోట్లు కాగా రూ.64.40 కోట్లు ఇచ్చారు. బ్యాంకులు ఇస్తున్న రుణాలను మహిళలు సైతం సద్వినియోగం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నారు.

నియోజకవర్గంలో తీసుకున్న లింకేజీ రుణాల వివరాలు

మండలం	గ్రూపుల సంఖ్య	రుణ లక్ష్యం (కోట్లలో)	రుణం తీసుకున్న గ్రూపులు	తీసుకున్న రుణం (కోట్లలో)
నూజివీడు	862	37.81	1143	102.25
ముసునూరు	1082	41.20	632	64.40
ఆగిరిపల్లి	728	34.87	1006	87.37
చాట్రాయి	883	40.89	574	51.65
మొత్తం	3,555	154.77	3,355	305.67

అభివృద్ధికి ఆద్యుడు ఎమ్మెల్యే మేకా

నూజివీడు అభివృద్ధిలో మేకా వంశీయుల పాత్ర కీలకం



నూజివీడు: వినయత్వానికి, మర్యాద, మన్ననలకు ప్రాధాన్యమిచ్చే మేకా వంశస్థులు. వేల ఎకరాల భూములను పేదలకు పంచిపెట్టి, వందల కోట్ల ఆస్తులను విద్యావ్యాప్తికి వితరణగా అందజేశారు. అదే బాటలో నూజివీడు అభివృద్ధికి ప్రభుత్వ సహకారంతో పాటుపడుతున్నారు మేకా వంశానికి చెందిన జమిందార్ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు. శత్రువునైనా సాదరంగా ఆహ్వానించి, మర్యాదనిచ్చే వ్యక్తిత్వం ఆయనది.

నాలుగు దశాబ్దాలుగా ప్రజల సేవలోనే..

1983లో రాజకీయాల్లోకి వచ్చారు మేకా వెంకట ప్రతాప్ అప్పారావు. 2004–09 మధ్య కాలంలో ఎమ్మెల్యేగా పనిచేసినప్పుడు నూజివీడు పట్టణంలోని నాలుగు వేల మంది పేదలకు నివేశన స్థలాలు పంపిణీ చేసి, ఇందిరమ్మ గృహాలను మంజూరు చేయించారు. నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి మండలాల్లోని వందలాది మంది పేదలకు నివేశనస్థలాలను అందించారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో..

టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడ జరిగిన అభివృద్ధి శూన్యం. 2019–24 మధ్యలో నియోజకవర్గంలో దాదాపు 15 వేల మంది పేదలకు నివేశన స్థలాలను పంపిణీ చేశారు. ప్రతాప్ అప్పారావు తన హయాంలో నూజివీడు ప్రాంతంలో అభివృద్ధిని పరుగులెత్తించారు. ట్రిపుల్ ఐటీ, కృష్ణా జలాల పథకం, ఎమ్మార్ అప్పారావు కాలనీ, మ్యాంగోహబ్, మామిడి పరిశోధనాస్థానం, గురుకుల పాఠశాలలకు నూతన భవన సదుపాయం, ఇంటిగ్రేటెడ్ హాస్టల్, నూజివీడు ఆగిరిపల్లి రహదారి అభివృద్ధి, పలు పీహెచ్‌సీలకు నూతన భవనాల నిర్మాణం, నూజివీడు పెద్దచెరువుకు ఎత్తిపోతల పథకం, యనమదల, సుంకొల్లు చెరువులకు ఎత్తిపోతల పథకాలు, ఏరియా ఆసుపత్రిలో రూ.21 కోట్లతో నూతన భవన నిర్మాణం, రూ.1.20 కోట్లతో క్రికెట్ స్టేడియం అభివృద్ధి, మైలవరం రోడ్డు నుంచి విస్సన్నపేట రోడ్డుకు బైపాస్ నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరు, ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో అభివృద్ధి పథకాలు తీసుకొచ్చి పూర్తిచేసిన నాయకులు ప్రతాప్.

ఆరోసారి ఎన్నికల బరిలోకి..

నూజివీడు నుంచి ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు తాజాగా ఆరోసారి ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. 1999లో స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగి అప్పట్లో టీడీపీ, కాంగ్రెస్‌ల తరుపున పోటీచేసిన కోటగిరి హనుమంతరావు, పాలడుగు వెంకట్రావులకు చెమటలు పట్టించారు. ఆ తరువాత 2004లో కాంగ్రెస్ తరుపున పోటీచేసి కోటగిరి హనుమంతరావుపై 19 వేల ఓట్ల మెజారిటీతో ప్రతాప్ గెలుపొందారు. 2009లో కాంగ్రెస్ తరుపున పోటీచేయగా కొద్ది ఓట్ల మెజారిటీలో ఓడిపోయారు. 2014లో వైఎస్సార్ సీపీ తరుపున పోటీచేసి 10,500 మెజారిటీతో, 2019లో 16,500 ఓట్ల మెజారిటీతో విజయం సాధించిన ప్రతాప్ మళ్లీ ఇప్పుడు వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమం అజెండాగా ఎన్నికల రణరంగంలోకి దిగారు. హ్యాట్రిక్ సాధన లక్ష్యంగా పనిచేస్తున్నారు.

నేటి నుంచి 'పది' పరీక్షలు

పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లను పూర్తి చేసిన అధికారులు



ముసునూరు పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

ముసునూరు: మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో 726 మంది 10వ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాయనున్నట్లు ఎంఈఓ బీబీఎస్ సుబ్బారావు చెప్పారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఆదివారం ఆయన పరీక్ష కేంద్రాలను పరిశీలించి వివరాలను తెలియజేశారు. ముసునూరు, చెక్కపల్లి, గోపవరం హైస్కూళ్లలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, వీటిలో 9 హైస్కూళ్లకు చెందిన రెగ్యులర్ విద్యార్థులు 584 మంది, సప్లిమెంటరీ విద్యార్థులు 142 మంది పరీక్షలకు హాజరవుతున్నారని చెప్పారు. ముసునూరు కేంద్రంలో ముసునూరు హైస్కూలు, గురుకుల బాలికలు 201 మంది, సప్లిమెంటరీ విద్యార్థులు 32 మంది, చెక్కపల్లిలో చెక్కపల్లి, రమణక్కపేట, గుడిపాడు, చాట్రాయి మండలం మర్లపాలెం రెగ్యులర్ విద్యార్థులు మొత్తం 236 మంది, సప్లిమెంటరీ విద్యార్థులు 56 మంది, గోపవరంలో గోపవరం, వేల్పుచర్ల, కాట్రేనిపాడు రెగ్యులర్ విద్యార్థులు 147 మంది, సప్లిమెంటరీ విద్యార్థులు 54 మంది, మొత్తం 726 మంది పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, టాయిలెట్లు, ప్రథమ చికిత్స వంటి అన్ని సౌకర్యాలు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. పరీక్ష సమయం కన్నా అర గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు.

తిరువూరు: తిరువూరులో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ఆరు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. సెంట్ ఆన్స్ స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, శ్రీనిధి స్కూల్, శ్రీచైతన్య, నాగార్జున హైస్కూళ్ళలో సోమవారం నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు మొత్తం 1021 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. వీరిలో 577 మంది బాలురు, 444 మంది బాలికలు ఉన్నారు.

చాట్రాయి: మండలంలోని చాట్రాయి జెడ్పీ హైస్కూలు, ఆర్‌సీఎం స్కూళ్లల్లో సోమవారం నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. రెండు పరీక్షా కేంద్రాల్లో బాలురు 195, బాలికలు 166 మంది పరీక్షలు రాయనున్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సరఫరా, వైద్యం సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈవో బ్రహ్మాచారి ఆదివారం తెలిపారు.

ఆగిరిపల్లి: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఎంఈఓ కె.సర్వేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆగిరిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్, ఎస్వీ పబ్లిక్ స్కూల్లో పరీక్ష కేంద్రాలలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలోని తెలుగు, ఇంగ్లిష్ మీడియం, సప్లమెంటరీ కలిపి 790 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరుకానున్నారు.

నేడు, రేపు ఆత్మీయ సమావేశాలు

తిరువూరు: వైఎస్సార్‌సీపీ కాపు కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం తిరువూరు మండలంలోని లక్ష్మీపురం మనో గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు ఆహ్వాన కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట, మచిలీపట్నం శాసనసభ్యులు సామినేని ఉదయభాను, పేర్ని నాని, రాష్ట్ర కాపు కార్పొరేషన్ అధ్యక్షుడు అడపా శేషగిరి, ఆకుల శ్రీనివాస్, విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని), తిరువూరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు విచ్చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని కాపులందరూ ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనాలని కోరారు. ఈ మేరకు ఆదివారం కాపు ప్రజాప్రతినిధులను కలిసి ఆహ్వానపత్రికలను కాపు సంఘ సభ్యులు అందజేశారు.

19న మాదిగ ఆత్మీయ సమ్మేళనం

ఈ నెల 19న వైఎస్సార్‌సీపీ మాదిగల ఆత్మీయ సమ్మేళనం తిరువూరు మండలం లక్ష్మీపురంలో నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 10 గంటలకు మనోగార్డెన్స్ ఆవరణలో జరిగే ఈ సమ్మేళనానికి బాపట్ల ఎంపీ నందిగం సురేష్, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కనకారావు, లిడ్‌క్యాప్ చైర్మన్ రాజశేఖర్, నందిగామ ఎమ్మెల్యే జగన్మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్, విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శ్రీనివాస్ (నాని), తిరువూరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు విచ్చేస్తున్నట్లు తెలిపారు. మాదిగ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమ ఆహ్వాన పత్రికలను పలువురు ప్రజాప్రతినిధులకు ఆదివారం అందజేశారు.

హెల్మెట్ ధరిస్తేనే జీవితాలకు రక్షణ



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

మైలవరం: ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి జీవితాలు కాపాడుకోవాలని మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం స్పెషల్ క్యాంపు రెండో రోజు నిర్వహించారు. 'హెల్మెట్ వినియోగం–రోడ్డు ప్రమాదాల నివారణ' అనే అంశంపై కనిమెర్ల తండా పురవీధుల్లో కళాశాల విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు. మైలవరం సీఐ కే కిశోర్ బాబు మాట్లాడుతూ హెల్మెట్ ధరించి ప్రమాదాల నుంచి రక్షణ పొందాలన్నారు. కళాశాల ఎన్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి.శివ మరిప్రసాద్ మాట్లాడారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. వలంటీర్లు వాహన చోదకులకు గులాబీ పూలు అందజేస్తూ హెల్మెట్ వాడాలని సూచించారు. కనిమెర్ల తండాలో ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి ఎస్.ఉమామహేశ్వరరెడ్డి, వివిధ విభాగాధిపతులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కే రామకృష్ణ

నూజివీడు: రాజకీయ పక్షాలన్నీ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాల్సి ఉంటుందని, ఎక్కడైనా ఉల్లంఘించినట్లయితే చట్టప్రకారం చర్యలు తప్పవని నూజివీడు రూరల్ సీఐ కె.రామకృష్ణ హెచ్చరించారు. స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఎన్నికల విధులు నిర్వహించే పోలీస్ అధికారులు, సెక్టార్ అధికారులు, రూట్ మొబైల్ ఇన్‌చార్జిలకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికలు నిస్పక్షపాతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటుందన్నారు. అధికార పార్టీకి చెందిన అభ్యర్థులు ప్రభుత్వ వాహనాలను, ప్రభుత్వ గెస్ట్‌హౌస్‌లను ఉపయోగించకూడదన్నారు. ఎన్నికల సమయంలో అలజడులు సృష్టించే అసాంఘిక శక్తులపై నిఘాను ఉంచాలని, అవసరమైతే వారిని బైండోవర్ చేయాలన్నారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించొద్దని, బాధ్యతాయుతంగా పనిచేసి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. నూజివీడు నియోజకవర్గంలోని పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ అమలుపై ప్రత్యేక నిఘా



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ మృత్యుంజయరావు

ఆగిరిపల్లి: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో గ్రామాల్లో కోడ్ ఉల్లంఘనలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మృత్యుంజయరావు సూచించారు. ఆగిరిపల్లిలో ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నియమావళిపై అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామాల్లో బహిరంగ ప్రదేశాల్లో బ్యానర్లు, ప్రచారానికి సంబంధించిన ఇతర ఏవైనా ఉంటే వెంటనే తొలగించాలన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈ సమావేశానికి ఎంపీడీవో శామ్యూల్, ఎస్ఐ సురేంద్ర కుమార్, ఎంఈఓ సర్వేశ్వరరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం



లోపూడిలో ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న జెడ్పీటీసీ డాక్టర్ ప్రతాప్

లోపూడి (ముసునూరు): లోపూడి ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆ సంస్థ నియోజకవర్గ అధ్యక్షుడు దుబ్బాకు దేవరాజు చెప్పారు. మండలంలోని లోపూడిలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గ నియామకం జరిగిందన్నారు. అధ్యక్షుడుగా బందెల పవన్‌కుమార్, ఉపాధ్యక్షులుగా దుబ్బాకు దాసు, ఐబాబు, ప్రసాద్, ప్రధాన కార్యదర్శులుగా డి.రాజశేఖర్, ఎల్.ముత్యాలు, టి.అశోక్, జి.వంశీ, కోశాధికారిగా ఎస్.జయరాజు, ప్రచార కార్యదర్శులుగా ఎల్.మనోజ్ కుమార్, ఎం.వెంకటకుమార్, దుబ్బాకు రాంబాబు, డోలా రాంబాబు, మరో 10 మంది కార్యవర్గ సభ్యులుగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులతో జిల్లా అధ్యక్షుడు నమ్మిన నాగార్జున ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ వరికూటి ప్రతాప్ హాజరై నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

నిష్కళంక మాత ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



ముసునూరులో నిష్కళంక మాత ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫాదర్లు

ముసునూరు: వేలాది మంది విశ్వాసుల ఆకాంక్షలు నెరవేరుస్తూ, భక్తుల కోరికలు తీరుస్తూ, శ్రమల కాలపు ప్రార్థనలకు ప్రతీకగా నిలుస్తున్న నెప్రూనగర్ నిష్కళంక మాత మహోత్సవాలను విజయవంతం చేయాలని, ముసునూరు ఆర్సీఎం విచారణ కర్త, పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ జోసఫ్ తంబి కోరారు. ముసునూరు ఆర్సీఎం విచారణ కార్యాలయం వద్ద నిష్కళంక మాత మహోత్సవాల పోస్టర్లను ఓఎంఐ నోవిస్ మాస్టర్ జోయ్ అమల్‌తో కలసి ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ నెల 21 నుంచి 23 వరకు భక్తి కీర్తనలు, ఉపవాస ప్రార్థనలు, సిలువ మార్గం, వాక్య సందేశాలు, దివ్య బలి పూజ, సత్ప్రసాద ఆరాధనలు, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రజలు, విశ్వాసులు విజయవంతం చేయాలని ఫాదర్లు కోరారు. కార్యక్రమాల్లో ఫాదర్లు జాన్ భారతి, గాంధీరాజ, రాజశేఖర్, నిర్మల్‌కుమార్, సిస్టర్లు, ఉపదేశులు బెనర్జీ, స్వామిదాసు, ఆంతోని, ఏసుపాదం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భావనారుషి కల్యాణం

తిరువూరు: పద్మశాలీయుల మూలపురుషుడైన భావనారుషి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం తిరువూరులో నిర్వహించారు. స్థానిక పద్మశాలీయ సామాజిక భవనంలో భద్రావతీ సమేత భావనారుషి కల్యాణాన్ని అరిపిరాల అప్పయ్యశాస్త్రి అర్చకత్వంలో జరిపారు. నూతనంగా నిర్మించిన సామాజిక భవనాన్ని డాక్టర్ కొడాలి శ్రీనివాస్ బహదూర్, డాక్టర్ పెనుమల్లి నాగేశ్వరరావులు ప్రారంభించారు. పద్మశాలి సంఘ అధ్యక్ష కార్యదర్శులు స్వర్గం నాగేశ్వరరావు, పర్వతం రామారావు, కోశాధికారి అవారిశౌరి, సంఘ పెద్దలు నల్లమోలు మధుసూదనరావు, కూరపాటి వెంకటరత్నం, శ్రీనివాసరావు, పులిపాటి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల శిబిరంపై దాడి

తిరువూరు: మండలంలోని కాకర్లలో ఆదివారం కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న తిరువూరు పోలీసులు దాడి చేశారు. 12 మంది కోడి పందేలు వేస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మూడు కోళ్లు, రూ.950 నగదు, 12 ద్విచక్ర వాహనాలు స్వాధీన పరచుకున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. జూదాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులకు ఉపాధ్యాయులే మార్గదర్శకులు



హెచ్ఎం విజయలక్ష్మిని సత్కరిస్తున్న సత్యనారాయణరెడ్డి, గంగాధరరావు తదితరులు

కనిమెర్ల(మైలవరం): విద్యార్థులకు ఉపాధ్యాయులే మార్గదర్శకులుగా ఉండి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి సూచించారు. మండలంలోని కనిమెర్ల ఎంపీపీ పాఠశాల విద్యార్థులు నలుగురు ఇటీవల విజయవాడ బెరమ్‌పార్క్‌లో నిర్వహించిన వర్డ్ పవర్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. 3వ తరగతి విద్యార్థి బి.రేవంత్‌కుమార్, 5వ తరగతి నుంచి బి.అనిల్‌కుమార్, రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి పొందగా, 2వ తరగతి నుంచి ఏ హేమ బిందు 4వ స్థానం, ఏ రేఖ 6వ స్థానం పొందారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను శిక్షణ ఇచ్చిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మండవ విజయలక్ష్మిని ఘనంగా సన్మానించారు. వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు, విద్యా కమిటీ చైర్మన్ ఏ లక్ష్మణరావు, చంద్రాల సొసైటీ అధ్యక్షుడు బి.నాగమల్లేశ్వరరావు, కనిమెర్ల సర్పంచ్ ఎల్.మోహన్‌నాయక్, వార్డు సభ్యులు బి.వాసు, ఎల్.రాము, బి.శివాజీ, పోరాటనగర్ సర్పంచ్ బి.కృష్ణ ఉపాధ్యాయులు, పీఆర్‌టీయూ అధ్యక్షుడు బి.గోపాల్ పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



నూజివీడు: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త మూల్పూరి లక్ష్మణ స్వామి అన్నారు. పట్టణంలోని ఎంవీఆర్ జూనియర్, డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఆదివారం వీడ్కోలు సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న లక్ష్మణస్వామి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్య సాధనకు పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. ఇప్పుడు కష్టపడి చదువుకుంటేనే భవిష్యత్ బాగుంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వరాటి రమేష్, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.